# అనగా అనగా..

- శ్రీనివాస ఫణి కుమార్

అమ్మలు --- డాడీ, డాడీ ఒక కథ చెప్పు..
అతను---- ఏం బంగారూ, నిద్ర రావటంలేదా?
అమ్మలు--- అవును డాడీ
అతను---- సరే అయితే, ఇలాదా..ఆ తలగడా తెచ్చుకుని నా వొళ్ళో బజ్జో..కథ చెబుతాను
అమ్మలు--- సరే డాడీ
అతను---- అమ్మలు కి ఏం కథ కావాలి? "రాజుగారూ-రాకుమారుడూ" కథ కావాలా?
అమ్మలు--- వద్దు డాడీ
అతను---- మరీ.., "ఎగిరే తివాచీ-ఏకాక్షి అవ్వా" కథ కావాలా?
అబ్బాయి----- ఆ ఖత నిన్ననే చెప్పావు డాడీ
అతను---- ఆరి పిడుగా, నువ్వుకూడా లేచే ఉన్నావా? బేట్టు కొనలేదని కోపం వచ్చి ఏడింటికే పక్క ఎక్కారుగా అబ్బాయిగారు? కోపం పోయిందా? నిద్ర రావట్లేదా?
అబ్బాయి----- లేదు, కోపం కోపమే, ఖత ఖతే ..
అతను---- సరే అయితే, నువ్వు ఇటుపైపు బజ్జో, ఇవాళ "ఆవు-పులి" కథ చెబుతాను..
అబ్బాయి----- వద్దంటే వద్దు, ఆ ఖత అమ్మ ఎప్పుడో చెప్పేసిందోచ్.
అతను---- అయితే.., "దూడ-పులి" కథ వినండి
అబ్బాయి----- బావుంది బావుంది, చెప్పు
అమ్మలు--- అబ్బా..తొందరగా చెప్పు డాడీ..

అతను---- అనగా అనగా ఒక చిన్న వూరూ. ఆ వూళ్ళో ఒక చిన్న రైతు. ఆ రైతు దగ్గర ఒక ఆవు, ఒక దూడ వున్నాయి. దూడ మెడలో చిన్న చిన్న గంటలు..కాలికేమో మువ్వలూ కట్టి, చక్కగా బొట్టు పెట్టి, ముస్తాబు చేసి, దాంతో ఆడుకునేవారు రైతు పిల్లలు. ఆ దూడ చూడ్డానికి ఎంత బావుండేదో..ఆవుకేమో దూడంటే ప్రాణం. ఒక్క నిముషం దూడ కనబడకపోతే, ఆవుకి చాలా భయం వేసేసేది. దూడ కోసం పొలం గట్టుమీదా, వూరిలోనూ..అన్ని చోట్లా, వెతికేసేది. దూడకి పాలివ్వందే ఆవు ఏమీ తినేది కూడా కాదు.

అబ్బాయి ----- మరి పులి ఖత అన్నావు?
అతను---- తొందర పడకూ, పులి కూడా వుంది కథ లో
అమ్మలు--- పులి, అడవిలో వుంటుంది, కదూ..డాడీ?
అతను---- కరెక్ట్.అమ్మలూ, గుడ్ గర్ల్. సరే, కథ వినండి..ఆ వూరిని ఆనుకొని ఒక పేద్ద అడవి. ఆ అడవిలో బోల్డన్ని జంతువులు. ఒక పులి కూడా . అది ఏం చేసేదీ? ఆహారం కోసం, ఒక్కో సారి అడవి చివరికి వచ్చేది. వచ్చి..పొలం గట్లమీద మేసే మేకల్ని, గొర్రెల్నీ తీసుకెళ్ళి అడవిలో తినేసేది. ఆందుకని ఆవుకి అడవంటే చాలా భయం. రోజూ దూడ కి చెప్పేది--ఎప్పుడూ మిగితా దూడలతో కలిసి వుండు. ఎప్పుడూ అడవి దగ్గరికి కూడా వెళ్ళకు--అని. కానీ దూడకి చాలా సరదాగా వుండేది. ఆడవిలో యేముందో చూడాలని. దానికి తోడు, రెండు మూడు మచ్చల దూడలుండేవి మందలో. అవి అప్పుడప్పుడూ వచ్చి చెబుతూ వుండేవి..అడవి ఎంతో బావుంటుందనీ, అడవిలో కావలిసినంత ఆహారం వుందనీని. అవి మిగితా దూడలకి తెలియ కుండా ఒకటి రెండు సార్లు అడవిలోకి వెళ్ళి వచ్చాయి, అందుకని గొప్పలు చెప్పేవి.
అమ్మలు---- మరి, పులి వాటిని తినేయలేదా డాడీ ?
అతను---- లేదు బంగారూ..పులి కూడా మంచిదే, కానీ ఆకలేస్తే మాత్రం ఎదురుగా ఏముంటే దాన్ని తినేస్తుంది. సరే, ఒక రోజు దూడ ఎవరికీ చెప్పకుండా అడవి వైపు వెళ్ళింది. కొంచెం భయం వేసింది. అయినా సరే, ఇవాళ ఎలాగైనా అడవిని చూడాలి అని పట్టుబట్టి, మెల్లి మెల్లిగా అడవిలోకెళ్ళిపోయింది.
అమ్మలు---- అమ్మో!!
అతను---- ఆ..ఇంతలో సాయంత్రమైపోయింది. దూడ అడవిలో బోలెడంత ఆహారం చూసింది. కడుపునిండా హాయిగా మేసింది.రకరకాల జంతువుల్ని చూసింది. తనలాంటి దూడల్ని కూడా చూసింది. కానీ అవేవీ అంత స్నేహంగా మాట్లాడలెదు. దేని తిండి గొడవలో అది, అలా తిరుగుతున్నాయి. ఇంతలో పులి గాండ్రింపు వినిపించింది. గజ గజా వణికి పోయింది దూడ. ఢామ్మని ఎక్కడినించో దూకింది పులి. దూడని చూసి--


తెలుగు వాణి సంక్రాంతి ప్రత్యేక సంచిక జనవరి 2003

– అడవికెందుకొచ్చావు?---అంది. ఇక్కడ బోల్డంత ఆహారం వుందనీ, బోల్డన్ని జంతువులు కూడా వున్నాయనీ మా నేస్తాలు చెబితే చూద్దామని వచ్చాను..అంది వణికిపోతూ..

పులి – సరే, ఈ అడవి నియమం చెబుతా విను. ఇక్కడ నీలాగే బోలెడన్ని దూడలున్నాయి. నాలాగే బోల్డన్ని పులులున్నాయి. మా సింహం రాజు గారు అన్ని జంతువుల్నీ రానిస్తారు తన రాజ్యం లోకి. కాని వొకసారి వచ్చిన జంతువు, కొన్నేళ్ళ వరకూ వెనక్కి వెళ్ళడానికి వీలు లేదు. వెళ్ళాలని ప్రయత్నిస్తే, ఆయన ఆ జంతువుని తినేస్తారు. ఇక్కడ స్వేచ్ఛగా బతుకు, కానీ, ఆకలేసినప్పుడు నాలాంటి పులి కంట పడ్డావో..నీ పని కాస్తా ఢామ్. కాబట్టి తెలివిగా, మెలకువతో బతుకు. అర్థమైందా?

దూడ---- అయ్యో, నేను వెనక్కి వెళ్ళిపోవాలండీ, నన్ను చూడకపోతే, మా అమ్మ ఏమీ తినదు. పాపం, ఏడుస్తుంది కూడా..అందుకనే నేను వెళ్ళిపోతానండీ..

పులి – ఇలాంటి వేషాలెస్తే నిన్ను ఇప్పుడే తినేస్తా, జాగ్రత్త, బుద్ధిగా అడవిలోకి పోయి, స్వేచ్ఛగా బతుకు.ఫో! అని, దూడని అడవిలోపలికి తరిమేసి, వెళ్ళిపోయింది. దూడ అడవిలో వుండిపోయింది. భయపడుతూ భయపడుతూ బతకటం నేర్చుకుంది. పులులనించి, సింహం రాజుగారి నించీ తెలివిగా తప్పించుకోవడం తెలుసుకుంది. కొన్నాళ్ళకి ఆ భయం, ఆ అడవీ అలవాటైపోయింది. కొన్నేళ్ళూ గడిచిపోయాయి. పాపం, ఆవు రోజూ అడవి సరిహద్దు దగ్గరికొచ్చి దూడని పిలిచేది. ఎంతో సేపు యేడ్చి యేడ్చి, అలిసి వెనక్కి వెళ్ళిపోయేది. కానీ దూడ రాలేదు. ఇప్పుడు దూడ కూడా పేద్ద ఆవు అయిపోయింది. దానికీ వో చిన్న దూడ. ఒక సారి చిన్ని దూడ అడిగింది, అమ్మా మనం ఎవరమూ? ఎందుకిలాగ రోజూ భయం భయంగా బ్రతుకుతున్నాము? అని. అప్పుడు గుర్తొచ్చింది దూడకి, తన గడువు తీరిపోయిందనీ, తను వెనక్కి వెళ్ళి పోవచ్చుననీని. అంతలోనే యేదో అనుమానం..తను వెనక్కి వెళితే, తనకీ, తన దూడకి అక్కడ ఆహారం దొరుకుతుందో లేదో? ఇన్నాళ్ళూ అడవిలో పెరిగిన పిల్ల దూడ, వూరిలో బతక గలదా? తన దూడకేమైనా అయితే? అమ్మో..ఇలా ఆలోచనలో పడిపోయింది ఒకప్పటి దూడ.



ఆమె------ శీనూ గారండీ..పిల్లలు పడుక్కొని అరగంట అయింది, కథ ఎవరికి చెబుతున్నారండీ? అయినా పిల్లలకెవరైనా ఇలాంటి కథలు చెప్తారా? పాపం.. దడుసుకోరూ?

అతను---- లేదు కన్నా, వాళ్ళకి యే కథ అయినా మొదట్లోనే తెలుసు. కథ కొంచెం అవగానే నిద్రపోతారు వాళ్ళు. అందుకే వాళ్ళకి యే కథ చెప్పినా దడుసుకోరు..

మెల్లిగా వాళ్ళ గది లో కి నడిచాడు, వెనకాలే ఆమె. అతను కాసేపు అలాగే కూర్చుండిపోయాడు. తరవాత ఆమె మెల్లిగా అతని వొళ్ళోకి చేరింది.

ఆమె------ ఏవండీ, ఆ దూడ వెనక్కి వెళ్ళిందా?, అంది తల పైకెత్తి అతని కళ్ళలోకి చూస్తూ..

అతను---- తెలియదు కన్నా..కొన్ని కథలకి, ముగింపు వుండదు, ఉన్నా, మనకి తెలియదు..

ఆమె------లేదండీ.. యీ కథ మీరే మొదలు పెట్టారు, కనక మీరే పూర్తిచెయ్యాలి, పూర్తిచెయ్యండి శ్రీనూగారూ, ప్లీజ్అండీ.. అంది గోముగా, చిన్నపిల్లలా..

అతను---- మ్.. మ్... సరే, అయితే..ఆ దూడ వెనక్కి వెళ్ళి హాయిగా జీవితం గడిపేసింది, తన చిన్నదూడతో. మళ్ళీ ఇంకెప్పుడూ అడవి వైపు కూడా చూడలేదు..

ఆమె------ మా శ్రీవారు మంఛివారు..

అంటూ, అతని నుదుటి మీద ముద్దు పెట్టుకుంది..

"జీవితం కథ అయితే ఎంత బావుంటుందో", కదూ కన్నా?

అడిగాడు అతను, ఆమె తలనిమురుతూ.

(ఈ కథ "అమెరికా భారతి, ఆటా–2000 పత్రిక" లోనూ, "రచన మాస పత్రిక" లోనూ ప్రచురితమై, తదుపరి 2001 సంవత్సర ఉత్తమ కథగా, "కథా మహల్– 2002" కథా సంకలనానికి ఎంపికయ్యింది. రచయిత అనుమతితో పునర్ముద్రితం – సం.)

# జవాబు ( లు )

## - సత్యం మందపాటి

కాఫీ కప్పు క్రింద పెడుతూ అడిగాడు లాయర్ విశ్వనాథ్ - "ఇప్పుడు చెప్పండి, నన్నెందుకు పిలిపించారో". డాక్టర్ రాజారామ్ నెమ్మదిగా అన్నాడు - "నా భార్యకు విడాకులు ఇవ్వాలనుకొంటున్నాను". విశ్వనాథ్ ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు - "అదేమిటి డాక్టర్ పదేళ్ళ దాంపత్య జీవితం సుఖంగా గడిపి ఇప్పుడు విడాకులేమిటి ?" అడిగాడు తేరుకొని. ఒక క్షణం ఆగి, అన్నాడు రాజారామ్ - "మా ఆవిడ ఒక ప్రముఖ దినపత్రికలో, రోజూ, పాఠకుల ప్రశ్నలకు జవాబులు ఇస్తుంది, మీకు తెలుసు కదూ!" "తెలుసు - ఆ శీర్షిక వలన ఈ ఆరేడేళ్ళలోనూ, ఆవిడకు చాలా పేరు కూడా వచ్చింది, కానీ ఆవిడ అలా జవాబులు యిచ్చినందు వలన మీరు విడాకులు ఇవ్వవలసిన అవసరమేమిటి ?" లాయర్ విశ్వనాథ్ అడిగాడు. "ఒక్క క్షణం ఆగండి!" అని రాజారామ్ లేచి, ప్రక్కన వున్న టేప్ రికార్డర్‌లో - ఒక కేసెట్ వుంచాడు.

"ఇంత చిన్న విషయానికి విడాకులు ఇవ్వవలసిన పని లేదు నిజమే, కానీ, ఇవ్వవలసి రావడం నా దురదృష్టం. ఈ "గాయత్రీ గోంగూర్" పత్రికలలో ఎలాటి ప్రశ్నలకి, ఎటువంటి జవాబులు ఇచ్చినా ఫరవాలేదు. ఇష్టం వున్న వాళ్ళు చదువుతారు, లేని వాళ్ళు లేదు. కానీ, ప్రతి రోజూ నాకు కూడా అలాగే.. ఎన్నాళ్ళని భరించడం? తను ఎన్నో పుస్తకాలు చదివి వుండవచ్చు కానీ, నా రియాక్షన్స్ కూడా గ్రహించి.. సారీ, ఎక్కువగా మాట్లాడుతునాను. మొన్న ఆదివారం సాయంత్రం బాల్కనీలో కూర్చొని మేము మాట్లాడుకొంటున్నప్పుడు జరిగిన సంభాషణని గాయత్రికి తెలియకుండా రికార్డు చేశాను. అది వింటే, నా బాధ మీకే అర్థం అవుతుంది.." అంటూనే, టేప్ రికార్డ్ ఆన్ చేశాడు డాక్టర్ రాజారామ్.

అందులోంచి మాటలు వినబడుతున్నాయి.
"చాలా రోజుల తరువాత, యిలా సాయంత్రం పూట, చల్ల గాలిలో కూర్చొని, నీతో ఆనందంగా గడిపే అవకాశం దొరికింది" - రాజారామ్
"అవును, రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం నెపోలియన్ కూడా ఇలాగే అందమైన సాయంత్రాలు సరదాగా గడిపేవాడట. ఆ తరువాత అటువంటి సాయంత్రాలు గడపలేకపోయానని వాపోతూ -మి అండ్ మై లైఫ్- అనే పుస్తకంలో రాసుకొన్నాడు"
"వాడి సంగతి మనకెందుకు గాయత్రీ? ఈ హాస్పిటల్లో ఉద్యోగం బోరు కొట్టేస్తోంది నాకు. క్షణం తీరిక వుండడం లేదు. అప్పుడప్పుడు ఈ డాక్టర్ కోర్సు ఎందుకు చదివానా? అనిపిస్తోంది కూడాను!"
"1955 లో డాక్టర్ ఫెదర్‌స్టోన్, లండన్ ఈవెనింగ్ ట్రిబ్యూన్ పేపరులో ఒక వ్యాసం వ్రాశాడు, తనలో కూడా సరిగ్గా ఇలాంటి భావాలే వస్తున్నాయని. కాకపోతే అతను, తన యాభై ఆరేళ్ళ జీవితం లోనూ..."
"గాయత్రీ - ముందు మన సంగతి ఆలోచిద్దాం. ఈ చల్లటి సాయంత్రాన్ని వృథా చేయకు. కాసేపు చక్కగా కబుర్లు చెప్పుకొందాం. భోజనం చేసిన తరువాత, ఏదన్నా సినిమాకి వెళదాం!"
"ఈ సినిమాలు అన్నవి సెల్యులాయిడ్‌తో తయారు చేసిన ఫిల్ము మీద ప్రింటు చేస్తారు. ఇవి 8ఎమ్ఎమ్, 16ఎమ్ఎమ్, 35ఎమ్ఎమ్, 70ఎమ్ఎమ్ అని రకరకాల సైజుల్లో వుంటాయి. ఫిల్ము సైజును బట్టి ప్రొజెక్టర్లు వుంటాయి. ప్రపంచంలో మొట్టమొదటగా ఈ సినిమాలను కనిబెట్టింది...."
"గాయత్రీ !" రాజారామ్ అరుపు పెద్దగా వినబడింది టేప్ రికార్డర్ లో. డాక్టర్ రాజారామ్ లేచి, టేప్ రికార్డర్ ఆఫ్ చేశాడు. మాట్లాడకుండా విశ్వనాథ్‌కేసి చూశాడు. విశ్వనాథ్ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. అప్పుడే వచ్చింది గాయత్రి, రెండు కప్పులతో కాఫీ తీసుకొని. "అలా కూర్చో గాయత్రీ.." అన్నాడు రాజారామ్.
గాయత్రి కూర్చొన్నది, పమిట నిండుగా కప్పుకొన్నది. "విడాకుల ప్రయత్నం మీద లాయర్ విశ్వనాథ్ గారిని రమ్మన్నాను. నీ అభిప్రాయం ఏమిటి గాయత్రీ?" అడిగాడు రాజారామ్. ఒక క్షణం ఆలోచించి - "ఈ విడాకులు అన్నవి ఇటలీ, ఫ్రాన్స్ దేశాలలో ఎక్కువ. తరువాత స్థానం అమెరికాది. ఇండియాలో విడాకుల కేసులు చాలా తక్కువనే చెప్పాలి. స్విట్జర్లాండ్ మాత్రం ఎనిమిదో స్థానం లోకి వస్తుంది" అన్నది గాయత్రీ గోంగూర్. డాక్టర్ రాజారామ్, లాయర్ విశ్వనాథ్, బిత్తరపోయి చూశారామె వైపు..
("తెలుగు వెలుగు" పత్రిక లోనూ, "మేడ్ ఇన్ అమెరికా" కథా సంకలనంలోనూ ప్రచురితం. రచయిత అనుమతితో పునర్ముద్రితం - సం.)


తెలుగు వాణి సంక్రాంతి ప్రత్యేక సంచిక జనవరి 2003

# హే! భగవాన్..

**- శ్యామ్ సోమయాజుల**

వేసవి కాలం. బాగా ఉక్క పోస్తోంది. థియేటర్లో ఏ.సీ. వెయ్య లేదు, కనీసం ఫ్యాను కూడా తిరగడం లేదు - ఇరవై, ముప్ఫై మంది దాకా ఉన్నారా హాల్లో. బాల్కనీ సీట్లో కూర్చొని ఉన్నాడు సాహిర్. గాలి ఆడకపోవడం వల్లనో, చూస్తున్న సస్పెన్స్ సినిమా వల్లనో గానీ, సాహిర్ వళ్ళంతా చెమటలు. సామాన్యంగా ఒక్కడే ఎప్పుడూ సినిమాకి వెళ్ళడు. సెలవల మూలాన తన స్నేహితులు చాలామంది ఊర్లకి వెళ్ళారు, మిగిలిన కొద్ది మందీ, ఆ సినిమా ముందుగానే చూసేయటమో లేక ఆ పాత ఇంగ్లీషు సినిమా ఇష్టం లేకనో, మొత్తానికి తోడు రావడానికి ఎవరూ దొరకలేదు సాహిర్‌కి. మరీ బోరు కొడుతోంటే ఒక్కడే వచ్చాడు.

అది మామూలు సినిమా కాదు. "ది ఓమన్!" ఎన్ని సార్లు చూసినా, చూసిన ప్రతి సారీ భయపడి తీరుతారు ప్రేక్షకులు. దేవునికి వ్యతిరేక శక్తి ఒకటి పుడుతుందనీ, అది దేవుని నమ్మే ప్రతి మనిషినీ చంపేస్తుందనీ, తనకోసం ఒక చీకటి ప్రపంచాన్ని సృష్టించుకొంటుందని బైబిల్‌లో రాసి వుంది(ట). దానిని ఆధారంగా తీసుకొని ఆ సినిమా తీశారు. మనిషి రూపంలో ఒక తోడేలుకి పుడతాడు ఆ "దెయ్యం". తన పుట్టుకను అనుమానించిన ప్రతి వ్యక్తినీ, ఆయా, తోడేలు, కాకిల సహాయంతో చంపుకొంటూ వస్తాడు. చివరికి, ఆ దెయ్యంబాబు తండ్రి కూడా ఆహుతి అవుతాడు. చెమటలు కక్కుతూనే సీటు అంచుమీద కూర్చొని మరీ సినిమా చూసేశాడు , సాహిర్.

సాహిర్, వరంగల్లులో ఇంజనీరింగు మూడో సంవత్సరం చదువుతున్నాడు. దేవుని మీదా, దెయ్యం మీదా, కులం మీదా, మతం మీదా - ప్రతి విషయం మీదా, చాలా దృఢమైన అభిప్రాయాలు వున్నాయి సాహిర్‌కి. దేవుని వునికిని తను అసలు నమ్మడు. మూఢ నమ్మకాలూ, మాయలూ, మంత్రాలూ, బాబాలూ - ఏవీ నమ్మడు. అలాగని, తన అభిప్రాయాలను ఎవరి మీదా రుద్దడు. సినిమా హాలు బయట అంతా చిమ్మ చీకటి. వీధి దీపాలు కూడా వెలగడం లేదు. "కరెంటు పోయినట్లుంది.." అనుకొంటూ మెల్లగా ఇంటి వైపు నడవసాగాడు సాహిర్. దారంతా ఆ సినిమా గురించి ఆలోచనలే. "గ్రెగరీ పెక్ మరో నటునితో కలసి, ఆ స్మశానంలో త్రవ్వడం, తోడేళ్ళు వాళ్ళ వెంట పడడం..." అన్నీ కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నాయతనికి.

ఆలోచిస్తూనే, గబగబా అడుగులు వేస్తూ, పదిహేను నిమిషాలలో ఇల్లు చేరాడు. రేకుల కప్పు ఇల్లు. పగలంతా ఎండకి వేడెక్కి, రాత్రి సెగలు కక్కుతుంది. బయట పడక మంచాల మీద అమ్మా, నాన్నా, చెల్లీ పడుకొని ఉన్నారు. బట్టలు మార్చుకొని మిగిలిన మంచం మీద వాలాడు సాహిర్ గాలి కూడా వెయ్యడం లేదు సరిగా. ఆ వూరిలో ఎవ్వరూ దుప్పటి కప్పుకొని ఉండరు ఆ రాత్రి. దగ్గరలోనున్న సిగరెట్టు ఫ్యాక్టరీ గంటలు కొట్టింది. లెక్క పెట్టాడు - ఒకటీ, రెండూ, మూడు....పన్నెండు! కళ్ళు మూతలు పడుతున్నాయి. చిన్నగా కునుకు పట్టింది.

అవే చూపులు. ఆయా కళ్ళలో - ఆ చూపు, ఆ కాకి నల్లని గుడ్లలో - ఆ చూపు, నడచి వస్తున్న తోడేలుదీ - అదే చూపు... ఛటుక్కున కళ్ళు తెరచాడు, అటూ ఇటూ పరికించి చూశాడు. ఛీ! ఇదేమిటి? భూతాలూ, దెయ్యాలూ లేవని ఇంత గట్టి నమ్మకమున్న తను, ఇలా భయపడటమేమిటి? ఇవన్నీ మానసిక బలహీనతల వలన వస్తాయి. వాటిని గురించి ఆలోచించటం మానేస్తే సరి. ఆలోచనలని వేరే విషయాల మీదకి మళ్ళిస్తే, ఆ భయం పోతుంది. ఎస్! తన ఇంజనీరింగు బుర్ర ఇలాటి పరిస్థితుల్లో లాజికల్‌గా ఆలోచిస్తోంది అనుకొంటూ, కళ్ళు మూసుకొని వాహినిని గూర్చి ఆలోచించాడు. ఉమెన్సు కాలేజిలో, బీకామ్ రెండవ సంవత్సరం చదువుతోంది. మూడు నెలల క్రితమే ఇద్దరి చూపులూ కలిశాయి, సాహిర్ క్రికెట్ మైదానం నుండి వస్తూండగా.

వయ్యారంగా నడచి తన వైపే వస్తున్న వాహినిని ఊహించుకోసాగాడు సాహిర్. ప్రతి అడుగుకీ శబ్దం చేసే గజ్జలు కాళ్ళకి, వాటిని తరచూ తగిలే పరికిణీ అంచులు. పల్చని ఓణీ వెనుక, కనిపించీ కనపడని సన్నని నడుము.. సృష్టికర్తకి ఎన్నేళ్ళు పట్టిందో, ఆ అందాన్ని సృష్టించడానికి. సాహిర్ ఊహలు మరి కొంచెం పైకి వెళ్ళాయి. ఇదేమిటి, వాహిని -


తెలుగు వాణి సంక్రాంతి ప్రత్యేక సంచిక జనవరి 2003

బాబ్డ్‌కట్- ఎప్పుడు చేయించుకొంది? ఎప్పుడూ నవ్వుతూ వుండే ఆ కళ్ళు, అదోలా... మరింత దగ్గరగా వచ్చేసింది, ఆ కళ్ళు.... ఆమె వాహిని కాదు, ఇందాక సినిమాలో చూసిన దెయ్యం "ఆయా"!

లేచి కూర్చొన్నాడు సాహిర్. అంతా చీకటి. కళ్ళు నులుముకొని అటూ, ఇటూ చూశాడు. లేచి ఇంట్లోకి వెళ్ళి, కుండలోని నీళ్ళు తాగి, అల్మారాలోంచి దుప్పటి తీశాడు. వచ్చి మంచం మీద వాలి తల నిండా ముసుగు వేసుకొన్నాడు. ఎంతకీ రాదేం పాడు నిద్ర? దూరంగా గంట కొట్టింది, ఒక్క సారే. ఇంకా ఒంటిగంటే అయ్యింది. రాత్రంతా ఎలా గడవడం? తన భయానికి కారణం వెతికాడు.

నిద్ర పట్టక పోవడానికి కారణం దెయ్యం గూర్చి ఆలోచనలు కాదు, సెలవల మూలాన, వంటికి వ్యాయామం కలిగించే పని ఏదీ చేయకపోవడం.. అసలే, సాయంత్రం క్రికెట్‌కూడా ఆడలేదివ్వాళ. అంత ఏకాగ్రతతో ఆ దెయ్యం సినిమాని ఒక్కడే చూసి వచ్చేటప్పుడు చిమ్మ చీకటిలోనూ దానిని గూర్చే ఆలోచించేటప్పటికి, ఎటు చూసినా అదే కనబడుతోందిప్పుడు. తను స్వతహాగా గొప్ప ధైర్యవంతుడు కాదు గాబట్టి, కొంచెం భయం వేయడం సహజం. కానీ ఇప్పుడీ భయం తగ్గడమెలా?

అమ్మ చెబుతూ ఉంటుంది - "హనుమాన్ చాలీసా" చదివితే అన్ని భయాలూ పోతాయని. వంటింట్లో, ఒక మూల చిన్న మందిరం ఏర్పరచుకొంది అమ్మ. రోజూ, తెల్లవారు ఝామున, రెండు గంటల పాటు పూజలు చేస్తుంది అందరు దేవుళ్ళకీ, ఏ దేవుడికీ కోపం రాకుండా. -దేవుడు లేడు- అని దృఢంగా నమ్ముతాడు సాహిర్, కానీ, ఈ రాత్రి, భయం వేసీ, నిద్ర పట్టక, మానసికంగా కొంచెం బలహీనపడ్డాడు.

తన మనసు అట్టడుగు పొరల్లో ఎక్కడైనా, సబ్‌కాన్షస్‌గా, ఏ కొంచెమైనా ఇంకా దేవుని పై నమ్మకం వుందేమో? కేవలం అందరిలో విభిన్నంగా కనపడాలనో, లేక నాస్తికత్వం ఒక ఫ్యాషననుకొనో తను ఆ నమ్మకాన్ని పెంచుకొని వుంటే, తననూ, తన నమ్మకాన్నీ, గుండె ధైర్యాన్నీ, ఈ రాత్రి



పరీక్షించుకొనే అవకాశం దక్కింది. లేచి వంటింట్లో మందిరం వైపు , పరుగు తీశాడు.

ఆ చీకటిలో, ఒక చిన్న గుడ్డి దీపం వెలుగుతోంది, అక్కడ ఆంజనేయస్వామి పటం ముందు. నాలుగయిదు పుస్తకాలున్నాయక్కడ. ఆ చిన్న కాంతిలో, ఏది హనుమాన్‌చాలీసాయో తెలియలేదు. లేచి వెళ్ళబోతుంటే కనిపించింది, చిన్న భరిణెలో, ఎర్రని కుంకుమ.

ఇన్నేళ్ళుగా అమ్మ చేసే పూజలతో పవిత్రమైనదీ, ఎవరెంత బ్రతిమాలినా, తన నుదుట ఏనాడూ రెండు నిమిషాలకంటే ఎక్కువగా ఉంచుకోనిదీనూ. చేయి చాచి, చిటికెడు కుంకుమను తీసుకొని కనుబొమల మధ్యన అద్దుకొన్నాడు. కొంచెం భయం తగ్గినట్లనిపించేసరికి, వెనక్కి వెళ్ళి మంచం మీద వాలి కళ్ళు మూసుకొన్నాడు. దూరంగా మళ్ళీ గంట కొట్టింది. లెక్క పెట్టాడు -రెండు-

ముసుగులో, అటూ-ఇటూ దొర్లాడు. ఇంకా నిద్ర పట్టడం లేదు. కళ్ళు మూసినా, తెరచినా, అవే ఆకారాలు. కళ్ళు మూసి ఊహలకు బందీ అయిపోయే బదులుగా, కళ్ళు తెరచి ఉంచుకొని ఆకాశంలో నక్షత్రాలను చూస్తూ వుండిపోయాడు. అయిదో గంట దాకా వినిపించింది. ఆ తరువాత ఎప్పుడో, తనకు తెలియకుండా, కన్నంటుకొంది. ప్రొద్దున లేచాక, మొఖం కడుక్కొంటూ అద్దంలో చూసుకొన్నాడు. రెండు కళ్ళూ నిద్రలేమితో, చింత నిప్పుల్లా ఎర్రగా వున్నాయి. వాటి మధ్యన కుంకుమ కూడా మరింత ఎర్రగా. అమ్మ చూడనే చూసింది ఆ బొట్టు. సంగతేమిటని అడిగేసరికి, జరిగినదంతా చెప్పాడు సాహిర్ "ఎలాగైతేనేం, మొత్తానికి నీకు దేవుడి మీద నమ్మకం కుదిరిందన్నమాట" - అంది.

కొద్ది సేపు ఆలోచించి చెప్పాడు - "లేదు నా మనసులో ఎక్కడా, దేవుని మీద నమ్మకం లేదని రూఢి అయ్యింది. నాకు దేవునిపై కాస్తైనా నమ్మకం వుండి వుంటే, రాత్రి కుంకుమ బొట్టు పెట్టుకొన్న తరువాతైనా భయం తగ్గి, చక్కగా నిద్ర వచ్చేది. అయిదు గంటల వరకూ మెలకువగానే వున్నాను"

# జాతకం

**- కె. వి. ఎస్. రామారావు**

రాత్రంతా నిద్రపోలేదు సత్యానంద్. సినిమా విడుదల అంటే మాటలా? ఎన్ని పన్లు! ఎంతమందితో ఫోన్లు!! ఎందరికి పురమాయింపులు! ఎందరికి బుకాయింపులు!! ఇంకెందరికి బుజ్జగింపులు!!! పెళ్ళివారిల్లులా వుంది ఆఫీసు - రణగొణధ్వనుల్తో, వచ్చే పోయే వాళ్ళతో, వచ్చి "పుచ్చుకునే" వాళ్ళతో, పోతూ పట్టుకుపోయే వాళ్ళతో, రాని వాళ్ళ ఫోనుల్తో, వస్తాం అనేవాళ్ళ హోరుతో - పిచ్చెత్తుతోందా అనిపించింది అదంతా భరిస్తూ, ఎలాగోలా డబ్బాలు చేరవలసిన వాళ్ళందరికి పంపటం పూర్తిచేసే సరికి. కొంచెం నడుం వాలుద్దామంటే సందు లేదు. వాల్చినా ఆ గోలలో నిద్రపట్టే వీల్లేదు.

తెల్లవారింది. పక్కనే వున్న చిన్న హొటల్‌కి ఇలాటప్పుడే అసలైన బిజినెస్. వాళ్ళు కూడ రాత్రినుంచి రకరకాల పదార్థాలు సరఫరా చేస్తూ నిద్రకి జోగుతున్నారు. ఐనా సరే, సత్యానంద్ బృందం మొహమాటపడకుండా ఎవరిక్కావల్సినవి వాళ్ళు చేయించుకుని, ఒక్కోసారి వాళ్ళే చేసుకుని, ఆరగిస్తున్నారు. మధ్యాన్నానికి పరిస్థితి ఎలావుండబోతోందో ఎవరికీ తెలీదు కదా! దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవటం బుద్ధిమంతుల లక్షణం! అందునా సినిమా బుద్ధిమంతులు "బుడ్డిమంతులు" కదా! కడుపులో పట్టినవి పట్టగా పట్టనివాటిని దగ్గర్లో వున్న చుట్టాల ఇళ్లలోనో స్నేహితుల దగ్గర్నో సొంతానికి వాడుకోకుండా ఒట్లేయించుకుని పెట్టివస్తున్నారు.

సత్యానంద్ ఎలాగో కాలకృత్యాలు ముగించి వచ్చి ఆఫీసులో కూర్చున్నాడు. ఇంకా తమ డబ్బు పూర్తిగా చేతికి అందనివాళ్ళూ, "ఎందుకైనా మంచిది, ఒకవేళ ఈసినిమా ఆడి మళ్ళీ మరోటి తీసే అఘాయిత్యానికి ఒడిగడితే ఇప్పుడు మంచితనం చూపించినందుకు అప్పుడేదన్నా దారి చూపించే అవకాశం ఉంది" అని ముందుచూపు చూసే మూర్ఖులు కొందరు, అప్పటిదాకా అతని ఉప్పు తిన్న విశ్వాసం కొంతైనా



నటిద్దామని ఆరాటపడుతున్న వర్ధమాన నటీనటులు కొందరు - ఇదీ అక్కడ కొలువుదీరిన సభ.

సెక్రెటరీ శంకర్రావు వైపు సాలోచనగా చూశారు సత్యానంద్ గారు. ఇప్పటికి ఇరవైమంది నిర్మాతలకి తల్లో నాలిగ్గా మెలిగిన శంకర్రావుకి ఇలాటి చూపుల అర్థాలే కాదు, అంతరార్థాలు, అంతరాంతర అర్థాలు కూడ కరతలామలకాలే! అంచేత, వెంటనే తన గంభీరస్వరంతో, "మన సత్యానంద్ గారి సిన్మా కనీసం పదిహేను సెంటరుల్లో వందరోజులు ఆడుద్దని బల్లగుద్ది చెపుతా" అని గుద్దటానికి బల్లకోసం చుట్టూ చూశాడు. వెంటనే అందుకున్నాడు మహేష్ (అసలు పేరు ఏదో చాలా పొడవుపాటిదే అయుంటుంది). ఐతే అతనికి దగ్గర్లోనే ఓ బల్ల కూడ ఉన్నందువల్ల దాన్ని గుద్ది మరీ చెప్పే అవకాశం అతనికి కలిగినందుకు శంకర్రావుకి కొంత ఈర్ష్య కలక్కపోలేదు. "వందరోజులు ఏవిటి సార్! సిల్వర్‌జూబిలీ అంటే నమ్మండి" అన్నాడతను.

ఇవన్నీ తనూ అనుకుంటున్నాడు సత్యానంద్. ఐతే పైకి మాత్రం మొహమాటంగా, "ఏదో పది సెంటర్లలో యాభైరోజులు ఆడితే మన డబ్బు మనకొస్తదయ్యా. అంతకంటే నాక్కావాల్సింది లేదు" అన్నాడు చేతిలో అప్పుడే ఖాళీ ఐన గ్లాసుని ముందుకి నెడుతూ. వినమ్రంగా శంకర్రావు దాన్ని మళ్ళీ మరో రంగు ద్రవంతో నింపటం క్షణంలో జరిగిపోయింది. "అలా అనకండి సార్! కేవలం యాభై రోజులే ఆడితే మన హీరో గారి పరువు ఏం కావాలి? ఆయనకిది ప్రిస్టేజి పిక్చరు కూడా!!" అన్నాడు మహేష్ ఆదుర్దాగా.

"ఆ హీరోకి ప్రిస్టేజి పిక్చరు కాందేది? పోయిన మూడేళ్ళలో ఒక్కటంటే ఒక్కటి యాభైరోజులు కూడా ఆడిన పాపాన పోలేదు కదా!" అని ఎవరో సణుక్కున్నా ఎవరూ ఆ మాటలు విన్నట్టు లేరు. "కాని ఈ మధ్య అతనివి ఏ పిక్చర్లూ ఆడలేదు గదయ్యా?" అన్నారు సత్యానంద్, ఆ విషయం ఇప్పుడే తెలుసుకున్నట్టు. "భలేవారు సార్! ఆయన దశ గిరగిరా తిరిగిందని, ఇంక ఆయన ఏ సెట్ మీద కాలెడితే ఆ సిన్మా నూర్రోజులు ఆడాల్సిందేనని మన జోతిష్యుడు చెప్పాకనే గదా ఆయన్ని మీరు హీరోగా

తీసుకుంది!" ఆశ్చర్యం వ్యక్తం చేశాడు శంకర్రావు. "నిజమేననుకో! ఐతే, మన జోతిష్యుడు గారు చెప్పినట్టుగా సిన్మాలు హిట్టు కావటం లేదని కొంతమంది గుసగుసగా ఓ మందుపార్టీలో చెప్పుకుంటుంటే ఈమధ్య విన్నానే!" అన్నాడు సత్యానంద్ తన "సంశయగ్రస్తుడి" పాత్రని విపరీతంగా పోషిస్తూ. మందు పూర్తిగా ఎక్కని కొందరు "నిజమే" అన్నట్టు తలలూగిస్తూ అంతలోనే మిగిలిన వాళ్ళ చూపులు తమ మీద పడుతున్నట్టు గ్రహించి గబగబా ఇంకొంచెం తీర్థం పుచ్చుకునే పన్లో పడ్డారు – తలూపింది "మందు ఇంకొంచెం వడ్డించమనే అర్థంలో" అని ఎవరన్నా అపార్థం చేసుకోవటానికి అవకాశం కలిగిస్తూ.

"అవన్నీ ఎందుకు సార్? మన హీరోయిన్ని చూసి యూత్ అంతా సిన్మా హాళ్ళ చుట్టూనే తిరుగుతారంటే నమ్మండి! బాలివుడ్ వాళ్లని తలదన్నేట్టు ఏకంగా అమిరికానించే వచ్చింది గదా మనమ్మాయి! ఎంత గొప్ప పిల్లంటే, మన పిచ్చర్లో పస్జేసిన ఆర్నెల్లలో గూడా ఒక్క ముక్క తెలుగు వంటబట్టలేదు, తను మాట్టాడింది ఒకటంటే ఒకముక్క మనెవరికీ అర్థవయి చావలేదు! ఆ అమ్మాయి చేతులో రేకలు చూసి మన జోతిష్యుడు గారు మూర్చబోతే ఆయన్ని లేపటానికి వాడ్కా వల్ల గాని కాలేదు గదా! ఇక ఆ అమ్మాయి జాతకం చూసి ఆయన ఒకటే గుండెలు బాదుకోవటం – ప్రపంచంలో వున్న అదృష్టం అంతా ఈ జాతకంలోనే ఇట్టా గుట్టలు పడుంటే ఇంక మిగతా జనం గతేందిరా బగవంతుడా, అని! అట్టాంటి హీరోయిన్ని పెట్టాక ఇంకా మన పిచ్చరుకి డోకా ఏందండీ?"

అని శంకర్రావు కొంచెం ఊపిరి పీల్చుకోవటానికి ఆగేసరికి అతనికి మళ్ళీ ఛాన్సివ్వకుండా అందుకున్నాడు మహేష్ – ఇక మన డైరెక్టరు గారంటారా – ఈ మజ్జనొచ్చిన హాలీవుడ్ సిన్మాలన్నిట్నీ ఆపోసన పట్టి, హిందీ పిచ్చర్లని తల్లకిందులుగా వొంటబట్టిచ్చుకుని, తమిల యూత్ పిచ్చర్లని భాషరాకపోయినా పదేపదే చూసి, ఎక్కడెక్కడి నుంచి ఎన్నెన్ని రకాల సీన్లు కొట్టుకొచ్చి మన పిచ్చర్ తయారుచేశాడో కదా!" దీని ముందు "ఇడియట్" బలాదూర్, "చిత్రం" లెక్కాపత్రం కాదు, "జయం" విషయం చెప్పనే అక్కర్లేదు. వాటన్నిట్నీ కలగలిపి ఒండేసి, ఒడబోసి, గుజ్జు తీసి



తీసింది కదూ మన పిచ్చరంటే! ఆడకపోవటానికి దానికెన్ని గుండెలు?" అని గర్జించాడు మళ్ళీ బల్ల పనిపడుతూ.

"అవున్సార్! "ఇడియట్"లో హీరో హీరోయిన్ని ప్రేమించి అది కూడ ప్రేమించేట్టు చేసుకోటానికి చేసిన చిలిపి చిలిపి పన్లకి కాలేజి కుర్రోళ్ళు యీల్లేసీ ఏసీ నోళ్ళు పుళ్ళు పడి హాస్పటళ్ళ చుట్టూ తిరుగుతున్నారు కదా! ఇంక మన సిన్మా చూస్తే పాపం ఏవైపోతారో అని నాకు చాలా బెంగగా వుంది సార్!! అందుట్లోను మందాన్లో హీరో హీరోయిన్ని రేప్ కూడ చేసేస్తాడు కదా – ఎంత ఒరిజినల్ ఐడియా సార్! ఇదివరకు హీరోయిన్లు ప్రేమించకపోతే కోపంతో విలన్లు రేప్ చెయ్యబోతే హీరోలు వచ్చి చితకబాదే వాళ్ళు. మన పిచ్చర్లో హీరోయిన్ ప్రేమించటం లేదని ఆ పిల్ల మీద ప్రేమ కొద్దీ దాన్ని రేప్ చేస్తాడు హీరో. అడ్డం వచ్చిన ఆ పిల్ల తల్లిదండ్రుల్ని ఉతికిపారేసి, ఇంకా మాట్టాడితే ముందుగా ఆ పిల్ల తల్లిని రేప్ చేసి ఆ తర్వాతే హీరోయిన్ని చేస్తానని కూడ నవ్వుతూ బెదిరిస్తాడు కదా! పాపం మన డైరెక్టరు గారు ఎన్నాళ్ళపాటు నిద్రాహారాల్లేకుండా కేవలం మందుతోటే గడిపి ఇలాటి బ్రమ్మాండమైన బ్రెయిన్ వేవ్ సంపాయించారో! ఆ ఒక్క సీను చాలు మన సిన్మా వందరోజులు ఆడటానికి" అని తన ఆర్గ్యుమెంట్ని పూర్తిగా పూర్తి చేసి అప్పుడే పక్క హొటల్ వాళ్ళు తెచ్చిన మసాలదోసెని ఓ పట్టుపట్టటానికి పూనుకున్నాడు.

సత్యానంద్కి అప్పటికి కొంత ధైర్యం చిక్కింది. నిజమే, వీళ్లన్నట్టు తన పిక్చర్లో హీరో, హీరోయిన్ల దగ్గర్నుంచి చివరికి ఆఫీస్ బాయ్ల వరకు అందరి జాతకాలు జాగ్రత్తగా చూపించాకనే వాళ్లని తీసుకోవటం జరిగింది. డైరెక్టర్ జాతకంలో లగ్నాధిపతిని శుక్రుడు వక్రదృష్టితో చూస్తున్నట్టు అనుమానంగా వుందని జ్యోతిష్యుడు చెప్పటమే ఆలస్యం – నవగ్రహశాంతీ, ప్రత్యేకించి శుక్రుడికి హోమం, ఎందుకైనా మంచిదని శనికీ రాహుకేతువులకీ కూడా ప్రత్యేకశాంతులూ జరిపించి, అవి చేసిన పురోహితులందరూ ముక్తకంఠంతో శుక్రుడు ప్రసన్నుడయ్యాడని ఒప్పుకున్నాకే ముహూర్తం షాట్ తియ్యనిచ్చాడు తను. ఇంతమంది ఇంత గొప్ప జాతకులు కలిసి తీసిన సిన్మా ఫ్లాప్ కావటానికి వీల్లేదు!

హన్నన్నా! ఎంతపని జరిగింది!! జ్యోతిష్యుడు ముందుగానే హెచ్చరించాడు - రిలీజ్ రోజు ఫస్ట్‌షో రిజల్ట్ తెలిసేవరకు "ఫ్లాప్" అన్న మాట మన ఆఫీసులో ఎక్కడా వినపడకూడదని! ప్రత్యేకించి తనకు చెప్పాడు - అలాటి ఆలోచన కూడా తన మనసులోకి రానివ్వకూడదని!! హడావుడిగా లోపలికి పరిగెత్తాడు సత్యానంద్.

అదృష్టవశాత్తూ ముందుచూపుతో ఇలాటి ఆలోచన ఒకవేళ వస్తే దానికి ప్రాయశ్చిత్తంగా లక్షసార్లు పునశ్చరణ చెయ్యాల్సిన మంత్రాన్ని బాత్‌రూమ్ గోడ మీద చాక్‌పీస్‌తో రాసివెళ్ళాడు జ్యోతిష్యుడు! బాత్‌రూమ్‌లోకి వెళ్ళిన సత్యానంద్ గుండె గుభేల్ మంది - ఆ మంత్రం ఎక్కడా కనపడటం లేదు! స్నానం చేసేప్పుడు తడిసి కారిపోయిందో లేకపోతే గోడ రంగులో చాక్ రంగు కలిసిపోయిందో - ఏమైతేనేం, మంత్రం మాయమయ్యింది!

కంగారుగా జ్యోతిష్యుడి సెల్ ఫోన్‌కి ఫోన్ చేశాడు. రింగ్ ఔతోందే తప్ప ఎవరూ తియ్యటం లేదు. అప్పుడు గుర్తొచ్చింది - ఈ పిక్చర్ సక్సెస్ కావటానికి ప్రత్యేకంగా జపం చేస్తూ ఎవరికీ కనపడకుండా ఎక్కడో కూర్చునివుంటానని, ఎవరూ డిస్టర్బ్ చెయ్యకుండా సెల్‌ఫోన్ ఆఫ్ చేస్తాననీ ఆయన చెప్పిన మాట! ఎలా? ఇప్పుడెలా? తెలిసిన వాళ్ళందరికీ ఫోన్ చేశాడు. ఎవరూ తెలియదన్నారు.

ఎవరినన్నా జ్యోతిష్యుడి ఇంటికి పంపుదామని బయటికి వచ్చి చూసేసరికి ఆఫీసంతా నిర్మానుష్యంగా వుంది. ఒక్కరంటే ఒక్కరు కనిపించలేదు. అందరూ అంత హఠాత్తుగా ఎలా మాయమయ్యారో అర్థం కాలేదు. ఒకవేళ తను నిద్రపోతూ కలలో వున్నానా అని అనుమానం వచ్చింది ఒక్క క్షణం. గిల్లుకుని చూసుకున్నాడు. నొప్పిగానే వుంది.

ఎందుకైనా మంచిదని బల్లని ఓ తన్ను తన్నాడు. అనుకున్న కన్న పెద్దగా కొట్టినట్టున్నాడు - వేలు బాగా నొప్పెపుట్టింది. అబ్బా అని కుర్చీలో కూలబడ్డాడు. కలకాదని తేలినట్టే. మరి ఏమైంది వీళ్ళందరికీ? అదేదో "వెనిల్లా స్కై" సిన్మాలోలా కాలేదు కదా! హఠాత్తుగా ఫోన్ మోగింది. తీశాడు. ఒక వికటాట్టహాసం! "తిక్క కుదిరిందా?" అన్న అరుపు. మళ్ళీ విలన్ నవ్వు. ఈసారి నాలుగైదు గొంతులు. నిశ్శబ్దం. అప్పటికి అర్థమైంది - తను చేసిన పొరపాటుకు గాను నిజంగానే తన పిక్చర్ ఫ్లాప్ అయింది! కాని, ఇంతమంది గొప్ప జాతకుల జాతకబలం ఏమైపోయింది? "ఉన్నావా? అసలున్నావా? ఉంటే కళ్ళు మూసుకున్నావా?.." అంటూ ఆవేశంగా పాట అందుకున్నాడు, ప్రేమనగర్‌లో నాగేశ్వర్రావులా వూగిపోతూ. ఎదురుగా ఎవరో వున్నారనిపించి తక్కుమని ఆపేసి చూశాడు.

శంకర్రావు! అతని చేతిలో ఓ కాగితాల కట్ట.

"ఈ జాతకుడి పాదం భస్మాసురహస్తమే! ఏదీ కలిసిరాదు" చదివాడతను ప్రశాంతంగా. "ఎవరిది? ఎవరిదా జాతకం? నాకు ఇన్నాళ్ళూ ఎందుకు కనపడలేదు?" గర్జించాడు సత్యానంద్. ఓ చిరునవ్వు నవ్వాడు శంకర్రావు. "మీదే సార్!" అన్నాడు మెల్లగా. ఉగ్రుడయ్యాడు సత్యానంద్. "ఎన్ని గుండెల్రా నీకు నా జాతకమే బాగులేదనటానికి? డొక్క చీరేస్తా!" విరుచుకుపడ్డాడు.

"నా జాతకమే సరిగ్గా చూసుకోకుండా ఇంత పనికి దిగాననా నీ ఉద్దేశ్యం? అంత వెధవలాగా కనపడుతున్నానా?". "నామీద కోప్పడితే ఏమీ ఉపయోగం లేదండి సత్యానంద్ గారూ! మీరు నెత్తిన పెట్టుకుని పూజించే జోతిషుడు గారు ఇప్పుడే మనిషి చేత పంపించారిది.

ఎప్పుడో దీన్ని రాసి దగ్గర వుంచుకున్నారంట. మీకు అప్పుడే చెప్పటానికి మనసొప్పక మీకు నచ్చేరకంగా అప్పుడు రాసి ఇచ్చారంట గాని మళ్ళీ తమ విద్యకి ద్రోహం చేసినట్టు ఔతుందని అసలైన జాతకం కూడా రాసి తమ దగ్గరే పెట్టుకుని దాన్ని బయటికి తీసే అవసరం రాకూడదని వెయ్యి దేవుళ్ళకి పూజలు చేస్తున్నారంట. కాకపోతే తమ జాతకం ఎంత పనికిమాలిందంటే అన్ని పూజలూ కూడ మీ పిక్చర్ ఫ్లాప్ కాకుండా చెయిలేకపోయినయ్యంట. ఆయన మీకు చెప్పమన్న మాట చెప్పాను. వస్తానింక" - అతను కూడ వెళ్ళిపోయాడు. తన కొత్త జాతకం వంక తీక్షణంగా చూస్తూ కూర్చున్నాడు సత్యానంద్.


తెలుగు వాణి సంక్రాంతి ప్రత్యేక సంచిక జనవరి 2003

# నాకు నచ్చిన పాట

- లత గొబ్బూరు

*నిన్ను నిన్నుగా ప్రేమించుటకు,*
*నీ కోసమె కన్నీరు నింపుటకు,*
*నేనున్నానని నిండుగ పలికే,*
*తోడొకరుండిన, అదే భాగ్యమూ, అదే స్వర్గమూ. .*
*మనసున మనసై, బ్రతుకున బ్రతుకై,*
*తోడొకరుండిన, అదే భాగ్యమూ, అదే స్వర్గమూ. . -మనసు-*

మహాకవి శ్రీ శ్రీ 1964 లో డాక్టర్‌చక్రవర్తి చిత్రం కోసం రచించిన ఈ గీతం, అమరగాయకుడు ఘంటసాల గళంలో, వినటానికి ఎంతో భారంగా వున్నప్పటికీ, ఒక్కొక్కసారి గుండె బరువుని దింపినట్లుగా అనిపిస్తుంది నాకు. "విప్లవ కవి" గానే, జన పరిచయం కలిగిన శ్రీశ్రీ గారు ఇలా ఆర్ధ్రతనిండిన, అద్భుతమైన గేయాన్ని వ్రాయటం చాలా అబ్బురంగా అనిపిస్తుంది. మనిషికి, మరో మనిషి అవసరం ఎంత ముఖ్యమో, నిత్య సత్యంగా చెప్పిన పాట ఇది. ఎందుకంటే, మనల్ని మనలాగా ఇష్టపడే వాళ్ళు చాలా అరుదుగా లభిస్తారు. కాలంతో బాటుగా పరుగులెత్తే ఈ జీవితంలో - "మీ ఇంటికొస్తే నాకేం పెడతారు? మా ఇంటికొస్తే, నాకేం తెస్తారు??" అనే వాళ్ళే ఎక్కువగా కనిపిస్తారు. కానీ, ఏది వున్నా, లేకపోయినా, "కష్ట సుఖాలలో తోడుగా, నీడగా, నేనున్నానని నిండుగా పలికే నేస్తం" నిజంగా మనకి తారసపడితే, అంతకన్నా అదృష్టం ఇంకేముంటుంది?

మనల్ని మననిగా ప్రేమించటానికీ, ఇష్టపడటానికీ, కన్నవారో, తోడబుట్టిన వారో, కట్టుకొన్నవారో కానక్కర లేదు. ముఖ్యంగా - మాతృ దేశం వదలి, దేశాంతరం వచ్చేసిన మనలాంటి వాళ్ళకి, "అయిన వాళ్ళు" అక్కరకు రావాలనుకొన్నా, రాలేని పరిస్థితులు ఒక్కొక్కప్పుడు కలగడం సహజం. అలా అని అమెరికాలో వున్నంత మాత్రాన, మనకు కష్టాలూ, కలతలూ రావని కాదుగా. ఉద్యోగాలు పోవచ్చు, ఆరోగ్యాలు క్షీణించ వచ్చు, పిల్లా పాపల అవసరాలు రావచ్చు, ఇలా ఎన్నో, ఎన్నెన్నో ఇబ్బందులు. అటువంటి సమయాలలోనే కదా, మనకంటూ సహాయపడి, మన వెన్ను తట్టి నిలబడే, మంచి మిత్రులూ, మంచి మనుషులూ, మన వాళ్ళవుతారు. వారే మనలను అర్థం చేసుకొని, ఒకరికొకరుగా సహాయపడి ఒడ్డున పడేస్తారు. స్వానుభవంతో చెబుతున్న సత్యమిది.

అన్నీ వుండి కొందరికి జీవితం వడ్డించిన విస్తరిగా వుండవచ్చు. అలాగని "నాకేమిటి? నాకెవరు కావాలి?" అని ఎప్పుడూ విర్ర వీగకూడదు. "ఏ నిమిషానికి, ఏమి జరుగునో, ఎవరూహించెదర"ని పెద్దలు ఏనాడో చెప్పారు కాబట్టి, ఈ జీవిత చక్రంలో - ఎవరితో, ఏ క్షణంలో, ఎలాటి అవసరం వస్తుందో, ఎవరి ఋణం ఎవరికి వుంటుందో ఎవరు చెప్పగలరు? మనకి, సాటి వారి అవసరం, ఒక్క బాధల్లోనే, తీరని దుఃఖాల్లోనే కాదు, అలవికాని ఆనందాన్ని పంచుకోవాలన్నా కావాలి. మరొకరితో పంచుకొన్నప్పుడే కదా మన ఆనందం రెట్టింపయ్యేది.

ఒక మంచి పని జరగాలన్నా, ఓ బాధని పంచుకొని గుండెని తేలిక చేసుకోవాలన్నా, మన ఆనందాతిరేకాన్ని పెంచుకోవాలన్నా - "మనసున మనసై, మంచి మనీషులై, మన మిత్రులై" మసలే వారే కదా మన తోడూ, నీడ. కొంతమంది, "నన్నంటుకోకు నామాలకాకి" అని -అంటకు, ముట్టకు- లాగా దూరదూరంగా మసలుతుంటారు. అలాంటి వారిని చూస్తే చాలా బాధ, కోపం కలుగుతాయి. సాటి వారు బాధల్లో, అవసరాల్లో వున్నారని తెలిసికూడా -మనకెందుకులే- అన్నట్లు వుంటారు. ఎటు తిరిగి, ఏం వస్తుందో అని నిమ్మకు నీరెత్తినట్లు వుంటూంటారు. అది చాలా తప్పనిపిస్తుంది. అన్ని బాధలలో, అన్ని అవసరాలలో, ఒక్క మంచి మాట కోసమూ, ఒక్క ఓదార్పుకోసమే కదా మనసు ఆరాటపడేది. కానీ ఖర్చు లేని సహాయం మాట సాయం కాదా? అది కూడా చేయలేని నిరుపేదలమా?

ఒక ఆలోచనను ఆచరణలో పెట్టాలన్నా, ఒక ఉన్నత ఆశయాన్ని సాధించుకోవాలన్నా, అనవసర ఆవేశాలను అదుపులో వుంచుకోవాలన్నా, "నేనున్నా"నని వెన్ను తట్టి నిండుగా పలికే ఆత్మీయులే తోడుంటే, అర్థం చేసుకొని "చేయూత నిచ్చే మనసే" నీడగా వుంటే, మనకన్నా అదృష్టవంతులింకెవ్వరు?


*తెలుగు వాణి* సంక్రాంతి ప్రత్యేక సంచిక *జనవరి 2003*

"నవ్వినా, ఏడ్చినా కన్నీళ్ళే వస్తాయి", అలా మనతో అవసరానికి -కంటి నిండా నీరు- నింపుకొనే వారున్నంత కాలం మన కన్నా భాగ్య వంతులింకెవరూ వుండరు. అంతకన్నా స్వర్గతుల్యమైన జీవితం మరొకటి లేదు. ఇంత గొప్ప, నిత్య నూతనమైన భావాన్ని, జీవిత సత్యాన్నీ, కొన్ని దశాబ్దాల క్రిందటనే చక్కని సినిమా పాట ద్వారా మనకందించిన మహా మనీషులకీ, నిరంతర స్నేహ భావంతో ఎద లోపలి అంచులని స్పృశిస్తూ, క్రొత్త జీవితాలను సృజించే ఎందరో మంచి మిత్రులకీ వందనాలు, వంద వందనాలు..

## అంతః కరణ

**- రమణి విష్ణుభొట్ల**

భాష కందని భావంలా
కుంచెకందని వర్ణంలా
ఉలికి అందని శిల్పంలా
కదిలేవు నీవు, నామది మెదిలేవు నీవు!

మురళికందని లీనంలా
స్వరముకందని గానంలా
పదముకందని నాట్యంలా,
కదిలేవు నీవు, నామది మెదిలేవు నీవు!

మనసుకందని మమతలా
చూపుకందని రూపులా
స్పర్శకందని సొంపులా
కదిలేవు నీవు, నామది మెదిలేవు నీవు!



## ఏక వర్ణాక్షర శ్లోకము

**- జెజ్జాల కృష్ణ మోహన రావు**

సంస్కృత వాఙ్మయములో చాల కవులను, పండితులను తికమకలు పెట్టించిన ఒక శ్లోకమును పరిచయము చేయుచున్నాను. ఇది ఒక ఏక వర్ణాక్షర శ్లోకము. పద్య మంతా ఒకే అక్షరముతో (హల్లు మఱియు అచ్చు) నిండినది. ఆ అక్షరము భా అను అక్షరము. ఇది ఏడు అక్షరములు కలిగిన ఉష్ణిక్ ఛందమునకు చెందినది.

భా భా భా భా భా భా భా భా
భా భా భా భా భా భా భా భా
భా భా భా భా భా భా భా భా
భా భా భా భా భా భా భా భా

ఇది శ్రీ మద్వాచార్యులు వ్రాసిన 81 శ్లోకములు గల యమక భారతములో 77వ శ్లోకము. యమకములో ఒక అక్షరసముదాయమునకు వివిధమైన అర్థములు ఉండును. నాకు నచ్చిన ఒక ఉదాహరణ-

"అతడు -మాధవుడా-? అత-డుమాధవుడా- ??"

(మాధవుడు అంటే, మా-ధవుడు, లక్ష్మి దేవి భర్త, విష్ణువు ఉమా ధవుడు అంటే, ఉమా-ధవుడు, పార్వతీ దేవి భర్త, శివుడు)

చేమకూర వేంకటకవి యొక్క విజయ విలాసములో ఇట్టివి పెక్కు లున్నవి. పై శ్లోకమునకు అర్థము నాలాటి వానికి తెలియదు. విమర్శకుల యొక్క వ్యాఖ్యానమును క్రింద ఇచ్చుచున్నాను.

The complete yamaka bhaarata with English translation may be found at:

*http://madhva.org/vms_mi/htm/Yamakabharatha_0.htm ( 1 - 29)*
*http://madhva.org/vms_mi/htm/Yamakabharatha_1.htm (30 - 67)*
*http://madhva.org/vms_mi/htm/Yamakabharatha_2.htm (68 - 81)*

The 77th verse would surely defeat any lay person's attempt at a translation, and even most scholars would be hard put to justify it in terms of known rules of syntax and semantics.

Sri Narahari Tiirtha explains it as follows:
దీప్తౌ జ్ఞానే భ ఆధారే భ ఔదార్య ఏవ చ సంధానే భ ఉపాదానే నికటత్వే చ కథ్యతే భ సేవ్యత్వే చ విద్వద్భిరూరీకరణ ఏవ చ సంపూర్ణతతిభావే భా నానాభావే చ కథ్యతే వైలక్షణ్యే తథా ఆధిక్యే స్వాతంత్ర్యే భ ఉదీర్యతే భ ఆనందే భ సంపూర్ణతతవాదే చ కథ్యతే పూజ్యభావే భ విస్తారే భ వినాశన ఈర్యతే స్వామిత్వే నిశ్చలే భావే ఉగ్రే చ ఉద్గాన్ ఏవ చ సమ్మోహనే అథ సంచారే భ విదారణ ఈర్యతే ఆలోచనే భ సౌందర్య ఇతి సర్వవిదారితం

Therefore, based on the illustrious commentator's expatiation, the eight-and-twenty uses of bhaa mean as follows:

1. భా దీప్తౌ – భా is for effulgence
2. భా జ్ఞానే – భా is for knowledge
3. భా ఆధారభావే – భా is for supportiveness
4. భా ఔదార్యే – భా is for generosity
5. భా సంధానే – భా is for determination
6. భా ఉపాదానే – భా is for giving
7. భా నికటభావే – భా is for closeness
8. భా సేవ్యత్వే – భా is for servability
9. భా ఊరీకరణే – భా is for bringing others to submission
10. భా సంతతిభావే – భా is for unlimited qualities
11. భా నానాభావే – భా is for multi-facetedness
12. భా వైలక్షణ్యే – భా is for extreme difference
13. భా ఆధిక్యే – భా is for superiority
14. భా స్వాతంత్ర్యే – భా is for independence
15. భా ఆనందే – భా is for joyfulness
16. భా సంతతవచనే – భా is for being uncontradicted
17. భా పూజ్యభావే – భా is for worshippability
18. భా విస్తారే – భా is for extensiveness
19. భా వినాశనే – భా is for destructiveness
20. భా స్వామిభావే – భా is for Lordship
21. భా నిశ్చలభావే – భా is for unchangingness
22. భా ఉగ్రభావే – భా is for ferocity
23. భా ఉద్గాతే – భా is for being the cause/object of sacrifices
24. భా సమ్మోహనే – భా is for causation of delusion
25. భా సంచారే – భా is for mobility
26. భా విదారణే – భా is for killing
27. భా ఆలోచనే – భా is for being the object/cause of thought
28. భా సుందరభావే – భా is for beauty

కొందరు 28 భా లకు బదులు 32 ఉందంటారు. అటులైన ఛందస్సు విద్యున్మాల అగును. ఈ అతి విచిత్రమైన శ్లోకమును చదివి, ఆనందించండి.

## చెప్పుకోండి చూద్దాం ?

సీతాలక్ష్మి తూపూరి

**1) 8 అక్షరములు గల "సిటీ"**

క్రింద, ఇచ్చిన క్రమంలో అక్షరములు కలిపితే వచ్చే అర్థములివ్వబడ్డాయి.

1-2-8 ఏనుగు
5-6 ఆభరణము
2-1-8 ప్రపంచము
3-4 భర్త
2-5-8 ప్రజలు
2-3-8 ధ్యానము
3-1 కక్ష
3-7-8 పైలోలాలకు చెందినది

**2) 9 అక్షరములు గల కావ్యము**

క్రింద, ఇచ్చిన క్రమంలో అక్షరములు కలిపితే వచ్చే అర్థములివ్వబడ్డాయి.

6-7-8-9 దొంగిలించుట
7-8-9 యుద్ధము
4-5-9 విరహము వలన వచ్చేది
1-2-3-4-9 దేవలోక పుష్పము
3-9 రోజులో ఒక భాగము
1-5-9 పుణ్యము కానిది
5-8-9 తాకట్టు
4-3 క్రొత్తది
6-2 విష్ణువు పేరు

# ఆధునిక కాలంలో పద్య రచన

- రామ్

"పద్యరచన" అనగానే "ఛందస్సు" జ్ఞాపకం వస్తుంది. యతి, ప్రాసల సంశోభితమై, మాత్రాబద్ధంగా తాళ, లయ, గతులతో విరాజిల్లేదే పద్యం. "పలుకు" పదికాలాలు పదిలంగా ఉండాలంటే అది పద్యం వల్లనే సాధ్యం. ఒక్క పదం ఎక్కువైనా, మరొక అక్షరం తక్కువైనా, అందచందాలు కోల్పోవడమే కాదు, అర్థమే మారిపోతుంది పద్యాలలో. సంధులూ, సమాసాలూ, వర్ణనలూ, అలంకారాలూ - భాషా సౌందర్యంతో బాటుగా, అసలు వ్యాకరణ విద్యా ప్రదర్శనకి ఆలవాలమైనదీ పద్యం. భావలాలిత్యానికీ, భాషా గాంభీర్యానికీ మచ్చుతునక పద్యం. అందుకే భావ ప్రకటనకి తగిన భాష, వృత్తాలూ ఛందస్సులో నిర్దేశింప బడ్డాయి. కందం రాసిన వాడే కవి - అని కదా నానుడి. పూర్వకాలంలో పద్య రచన శోభిల్లినంతగా నేడు పరివ్యాప్తి కావడం లేదు. దీనికి ఎన్నో కారణాలుండవచ్చు. నాకు తట్టినవి కొన్ని ఇవి -

1. పద్యం చదివే శ్రద్ధా, ఆసక్తీ పాఠకులలో సన్నగిల్లడం
2. కవులూ కవయిత్రులూ పద్యం కన్నా - యితర ప్రక్రియలకు ప్రాధాన్యతనివ్వడం
3. వచనాన్నీ, నిర్వచనాన్నీ, వాదాన్నీ, నినాదాన్నీ విజృంభించి ఉపయోగిస్తూ, వాక్యాలను, ఎక్కడకక్కడ విరగ్గొట్టి, పదాలుగా, పద్యాలుగా, పద్య పాదాలుగా చలామణీ చెయ్యడం
4. పద్య రచన చేసే వారనేకులు తమ వస్తువును భక్తి, శృంగారం మొదలైన సాంప్రదాయిక విషయాలకే పరిమితం చెయ్యడం
5. రచయితలలో, రచయిత్రులలో తమ తమ సామర్థ్యానికి మెరుగు పెడదామన్న తాపత్రయం తగ్గిపోయి, సాధించిన దానితో సంతృప్తిపడే మనస్తత్వం ప్రబలి పోవడం. వివిధ ప్రలోభలకు లోబడి, తను చేయ గలిగిన దానికన్నా, వ్రాయ గలిగిన దానికన్నా తక్కువ వన్నె రచనలను అందించే రచయితా రచయిత్రులు తమ్ము తాము మోసగించుకోవడమే కాదు, నిజంగా కళామతల్లికే తీరని ద్రోహం చేస్తున్నారని నా అభిప్రాయం.
6. ఘాటైన విమర్శకులు (ముందు మంచి పాఠకులై వుండాలి) కనుమరుగైపోవడం
7. నాణ్యతా ప్రమాణాలు కరువైపోవడం - నేడు చాలా మంది ఎవరి పుస్తకాలు వాళ్ళు ప్రచురించుకొంటున్నారు, అటు మంచి రచనలను ప్రచురించే ప్రచురణాలయాలూ (వావిళ్ళ), పత్రికలూ సరైన పోషణ లేక మూతబడిపోతున్నాయి

చిత్ర కవిత్వం, గర్భ కవిత్వం, బంధ కవిత్వం, ఆశు కవిత్వం, అవధానం మొదలైన అనేకానేక సాహిత్య ప్రక్రియలూ, కావ్యారవిందాల మకరందాలూ, ఇతిహాస పురాణేతి గ్రంథాల సొగసులూ - అన్నిటా పద్య స్వరూపం తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తూ వచ్చింది. తిరుపతి వేంకట కవులు, విశ్వనాథ, కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి, జాషువా, శ్రీశ్రీ, ఆరుద్ర మొదలైన వారెందరో పద్య రచన లోని ఒడుపులనూ, నానార్థ సంయోజితత్వాన్నీ తెలియజేస్తూ, అనేక పద్యరాజాలను ఆధునిక కాలానికి అందించారు. సులభశైలిలో రచించిన శతక పద్యాలూ, చాటు పద్యాలూ ఎంతగా ప్రజాదరణ పొందాయో మనకందరికీ తెలిసిన విషయమే. వాటిలో ఆధునిక వస్తువుని ఉపయోగించుకొంటూ లలితమైన పదాలతో, సామాన్యునికి కూడా అర్థమయ్యేలా పద్య రచన చేయడం జరిగింది. అయితే, నేటి పద్య రచన మాత్రం చాలా వరకూ శతకాలకూ, చాటువులకూ మాత్రమే పరిమితమై పోతోంది. అవధానం వంటి ప్రక్రియలు పద్యాలకు పూర్వ శోభను తెచ్చిపెట్టే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, వైవిధ్యం గల బహు కవితా వస్తువులను, పెక్కు భావాలనూ (ఆధునిక విషయాలతో సహా) పద్యాల ద్వారా వ్యక్త పరచడం దాదాపు అంతరించిపోతోంది. ఏ పత్రికలోని కవిత్వ విభాగం చూసినా పద్యాలు అంతకంతకూ అరుదైపోతున్నాయి. ఆధునిక భావ వ్యక్తీకరణకీ-పద్యానికీ అంత దూరమా అని ఆలోచించినప్పుడు, పట్టు వుండాలే కానీ, పద్యరచన కష్టం కాదనే విషయమూ, వాక్య నిర్మాణంపై శ్రద్ధ చూపాలే కానీ, ఆధునిక భావాలను పద్యాలలో వ్యక్త పరచడం సంక్లిష్టం కాదనే విషయమూ తేటతెల్లమవుతాయి.

నైపుణ్యం కల కుమ్మరి చేతిలో మన్ను వలె, భావం, భాష అభివ్యక్తీకరించే తీరును బట్టి పద్యం, పాట, కథ, నాటిక, నవల వంటి, ఏ మూసలోకైనా


తెలుగు వాణి సంక్రాంతి ప్రత్యేక సంచిక జనవరి 2003

ఇట్టే వొదిగి పోతాయి. ఉదాహరణగా, "వినాయక చవితి కథ"ను చిన్న చిన్న మాటలతో పద్యరూపంలో వివరించే ప్రయత్నం –

## శ్రీ వరసిద్ధి వినాయక పద్యమాల

శ్రీ గణనాథుని చరితము
వాగర్థములందగింప వ్రాయగ నెంచీ
నాగోపవీతధారుని
యోగధ్యానంబుసల్పి యోచింతు మదిన్..

భక్తుల కోర్కెలు దీర్చగ
శక్తికి మించిన వరములొసంగే శివుడా
భక్తికి మెచ్చి గజాసుర
భుక్తంబై తనివి తీర్చి పొట్టను చేరెన్..

కైలాసంబున గిరిసుత
చాలా తనియించె భర్త జాడ తెలియకా
ఫాలాక్షుని రక్షించి
యేలాగునొ వెదకి తెచ్చి యిమ్మని అడిగెన్.

హరిగూడెను బ్రహ్మాదుల
సరినందే గంగిరెద్దు సాగెను మేళం
అరిజంపిరుపాయముతో
గిరిజాపతి రక్ష జేసి గీడును బాపి..

చెలువపు బాలుని జేసెను
అలవోకగ లోకమాత యభ్యంగనమున్
సలుపుచు కావలి యుంచెను
నలుగునకే వెలుగులద్ది నలువయె తానై..

శూలిని యడ్డెను బుడుతడు
బాలునికేమెరుక తండ్రి, పాశము కలదే?
కేలెత్తి శిరము దునిమెను
హాలాహలధారి హరుడు యాగ్రహమందీ..

నిజ సుతునే జంపితియని
సజలాత్మకుడై కపర్ది సాలోచనగా
గజముఖమును తగిలించెను
ద్విజుడయ్యె గజాననుండు దీవెనలందెన్.

ఎలుకను యేనుగు యెక్కెను
పలుకగ విడ్డూరము కద పార్వతి తనయుల్
చిలుకుచు ముద్దుల మాటలు
కులుకుల నెమలిని యమరెను కొమరుడనుజుడున్.

ఎన్నగ విఘ్నాధిపతిని
అన్నా తమ్ముళ్ళ మధ్యనయ్యెను పోటీ
మిన్నేరుల మునగకనే
పన్నగపతి సేవ జేయ ఫలితము దక్కెన్.

గిరిజాసుతు రూపమునే
పరిహాసము జేసె రేడు పార్వతి కినిసీ
సరి యాతని జూచిన దుర్
భర నిందలపాపములను బడ శపియించెన్.

వేడగ సురులకు జెప్పెను
పీడలు బాపెడు తెరవును బింబాధరుడున్
వేడిన గజముఖు (భాద్రపద శుద్ధ) చవితిని
మూడును కీడెల్ల జనులు ముక్తిని బొందన్.


తెలుగు వాణి సంక్రాంతి ప్రత్యేక సంచిక జనవరి 2003

గోపాలుడు నిందలబడె
తా-పాలను చంద్రు జూచి తస్కరుడయ్యెన్
తాపమణిచె భల్లూకుని
చేపట్టెను మణి రమణుల చెలువము మీరన్.

వెనకటికి యగ్ని పడతుక
మునికాంతల రూపు దాల్చి ముచ్చట దీర్చన్
మునిపత్నుల యపనిందలు
గణనాథుని పూజసేయ గ్రక్కున తొలగెన్.

శిరసాప్రణమిల్లిన యా
వరమూషిక వాహనుండు వాంఛితమిచ్చున్
కరములు జోడింపగనే
కరివదనుడు వరములిచ్చి కరుణను కురియున్.

గణపతి వృత్తాంతంబిటు
మునులకు సూతుండు జెప్పె మోక్షప్రదమౌ
వినుతించిన విఘ్నపతిని
జనులకు సుఖ సిద్ధి శాంతి జయములుకలుగున్.

వ్రాసెను సంస్కృతమందున
వ్యాసుండాశువుగ చెప్ప భారత చరితం
కాసిని ఉండ్రాళ్ళిచ్చిన
దోసిట విద్దెలను కురియు తోషము జెందీ..

వెనకయ్యకు మొక్కండీ
అనుకొన్నవి యన్ని జరుగు నా గణాపతియే
మనకున్న యాది దైవము
ఒనగూర్చును తా సకలము ఒట్టది సుమ్మీ..



పలుకజ్జికాయలప్పం
బులు వుండ్రాళ్ళారగింపు పూర్ణములన్నం
బులు యటుకులు బెల్లంబును
ఫలరసములు పాలు పెరుగు పంచామృతముల్.

ఇరువదినొకండు పత్రులు,
విరిబాలలు పేర్చి పాల వింటిని కూర్చి
హరుసుతునారాధించిన
గరికలకే మురిసి యిచ్చు ఘనఫలితంబుల్.

బాల వినాయకునీవిధి
వీలుగ కొలిచిన తదుపరి విని యా కథలన్
మేలగునక్షంతలు గొన
